ఉదయం 10 గంటలయింది. శాయి క్లినిక్ ఓ.పి. రూమ్‌లో కుర్చీల్లో కూర్చొని డాక్టరుగారి రాక కోసం ఎదురుచూస్తున్నారు పేషెంట్స్. ఆయిల్‌తో క్లీన్ చేసిన పాలరాతి నేలపై నడిచే వారివి, కూర్చున్న వారివీ ప్రతిబింబాలు కన్పిస్తు న్నాయ్. రిసెప్షనిస్ట్ టేబుల్ మీద రెండు ఫోను లూ నిర్విరామంగా మోగుతున్నాయ్. టేబుల్ వెనుక అమర్చిన కుర్చీలో నీట్‌గా డ్రస్ చేసు కున్న అందమైన అమ్మాయి అటూ ఇటూ



# మంచి డాక్టర్

కదులుతూ ఫోన్‌లు అందుకొని మాట్లాడుతూ చలాకీగా వుంది.

గ్రీన్‌లైట్ వెలిగింది. క్లినిక్ అధినేత డాక్టర్ వినయ్‌కుమార్ కారు వచ్చి పోర్టికోలో ఆగింది.

'డాక్టరుగారు... డాక్టరుగారు!' వచ్చారు. అనుకుంటూ సిబ్బంది, పేషెంట్స్ ఎలర్ట్ అయ్యారు. అటెండర్ గబగబా కారు వద్దకు పరుగెత్తి, విష్‌చేస్తూ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

తెల్లని డ్రస్‌తో, మెడలో స్టెతస్కోప్‌తో, చేత బ్రీఫ్‌కేస్‌తో కారులోంచి దిగి, హుందాగా నడుచుకుంటూ ఓ.పి. రూమ్‌లో నుంచి వస్తుంటే రెండువైపులా కుర్చీల్లోని పేషెంట్స్ లేచి గౌరవంగా నిలబడి నమస్కారం చేస్తున్నారు. చిరునవ్వుతో తలపంకిస్తూ అటూ ఇటూ చూస్తూ చేయి ఎత్తుతూ మార్నింగ్, మార్నింగ్ అంటూ నవ్వుతూ మెల్లగా నడుస్తూ తన రూమ్‌లోకి వెళ్లిపోయారు. ఆటోమేటిక్ డోర్ తలుపులు మూసుకున్నాయి.

డాక్టరుగారి రూమ్ ముందు లైటు వెలిగింది. అటెండర్ ఓ.పి. చీటీల బండిల్ వరుసగా పేర్చి, డాక్టరుగారి ముందు పెట్టి వచ్చి డోర్ వద్ద తన సీటులో కూర్చున్నాడు. డాక్టరుగారి రూమ్ కాలింగ్ బెల్ మ్రోగింది. అటెండర్ చీటిలోని పేరు లక్ష్మిగారూ... అని పిల్చి, రండి... డాక్టరుగారు పిలుస్తున్నారు అన్నాడు. అలా వరుసగా అందరి పేర్లూ పిలవటం, అందరూ వరుసగా డాక్టర్‌గారి రూమ్‌లోకి వెళ్లటం, రావటం జరుగుతోంది. ఓ.పి. చకచకా సాగిపోతోంది.

బయటకు వచ్చిన పేషెంట్స్ నవ్వు నిండిన ముఖాలతో, తృప్తిగా... చేతుల్లో చీటీలతో మందుల

**కె.వి.ఆర్. హనుమంతరావు**

షాపు వైపు కదుల్తున్నారు. వచ్చిన వారు వెళుతూంటే ఇంకా కొందరు వస్తున్నారు. ఓ.పి. బిజీగా సాగుతూనే వుంది.

డాక్టర్‌గారిని చూస్తేనే చాలమ్మా... సగం రోగం పోతుంది. ఆయన మాట్లాడితే పూర్తిగా పోతుంది. అసలు కోపమే లేదు. ఎంత నెమ్మదిగా, మర్యాదగా, వైనంగా మాట్లాడుతారనీ... అన్ని విషయాలూ వివరంగా మళ్లీమళ్లీ అడిగినా విసుక్కోకుండా నవ్వుతూ ఎంత ఓపిగ్గా వుంటారనీ... ఈయన చిన్నతో, పెద్దతో మంచిగా మర్యాదగా మాట్లాడి, జబ్బుకు అవసరాన్ని బట్టి ఖరీదైనవి లేదంటే చౌకగానూ మందులు ఇస్తారు. మనం ఎంత ఇస్తే అంతే తీసుకుంటారు. ఎంతమంచాయనో! అసలు దేవుడనుకో... అంటూ ఒకరితో ఒకరు చెప్పుకుంటూ హాస్పటల్ కెళ్లి వైద్యం చేయించుకు వస్తూంటారు ఆ వూరి జనం.

అలా చక్కగా ప్రశాంతంగా సాగిపోతోంది వినయ్‌కుమార్ క్లినిక్.

ఒకరోజు ఎప్పటిలా క్లినిక్‌లో ఓ.పి చూస్తున్నారు డాక్టరుగారు. పేషంట్లతో రద్దీగా వుంది. వరుసగా పేషెంట్లను పిలుస్తున్నారు. పరీక్ష చేస్తున్నారు. మందులు ఇస్తున్నారు, పంపుతున్నారు. ఓ.పి.లో పేషెంట్సు తగ్గిపోయారు.

అటెండర్ చీటీ పట్టుకొని బయటకు వచ్చి శంకరం... శంకరం... శంకరం ఎవరు? అంటూ అటూ ఇటూ చూశాడు. ఎవరూ

పలకలేదు. ఒక మూల కుర్చీలో ఒళ్లో సంచి పెట్టుకొని తలవాల్చి కూర్చొని వున్నాడు ఓ యువకుడు పరధ్యానంగా. అటెండరు గబగబా అతని వద్దకు వెళ్లి “శంకరం! శంకరం అంటే నువ్వేనా! డాక్టరుగారు పిలుస్తున్నారు. రా!” అంటూ దగ్గరగా వచ్చి భుజం మీద చేయివేసి, “రావయ్యా! బాబూ! రా!” డాక్టరుగారు పిలుస్తున్నారు. అంత పరధ్యానమైతే ఎలా? రా! రా! అన్నాడు తరుముతున్నట్లు.

గడ్డం పెరిగి, సన్నగా బలహీనంగా గుంట కళ్లతో వున్న యువకుడు మెల్లగాలేస్తూ ‘ఆ! చావబోయేవాడికి ఇంకా తొందరేముంది? తొందరపడి ఏంచేయాలి?” ఎప్పుడైతే ఏంలే... పద... అంటూ మెల్లగా లేచి డాక్టర్‌గారి రూమ్‌లోకి అడుగుపెట్టాడు.

నీరసంగా నడుస్తూ లోపలికి వచ్చి యువకుణ్ణి చూస్తూ. “రావయ్యా శంకరం రా! కూర్చో. ఏమిటి... నీబాధ? అన్నారు డాక్టరుగారు చిన్నగా.

“అయ్యా! నాకు టి.బి. బాగా ముదిరి పోయిందట. ఊపిరితిత్తులు రెండూ చెడిపోయాయట. 2,3 నెలలు కన్నా ఎక్కువ కాలం బతకనంట. లాభం లేదు ఇంటికిపో అన్నారు సార్ పట్నంలో డాక్టరు. ఇయిగో రిపోర్టులు.

అంటూ గుడ్డ సంచిలోంచి తీసి డాక్టరు ముందు పెట్టాడు శంకరం.

డాక్టర్ ఆ రిపోర్ట్‌లు అన్నీ తీసుకొని పరిశీలించాడు.

“డాక్టర్‌గారూ! మీరు మంచి డాక్టరట. హస్తవాసి మంచిదట. చేయి పట్టుకుంటే చాలు... రోగాలు పోతాయట. అందరూ చెప్పుకుంటూంటే విన్నాను. మీకు ఒకసారి చూపించుకొని, ఏం చెబుతారో విందామని వచ్చాను” అన్నాడు దీనంగా.

డాక్టరు రోగి వంక మరోసారి పరిశీలనగా చూసారు. స్టెతస్కోప్‌తో గుండె, ఊపిరితిత్తులు, వీపు, వెనుకా ముందు వగైరాలు పరీక్షించారు. “శంకర్ మీది ఈవూరేనా! ఎక్కడుంటావ్? ఎవరి అబ్బాయివి? అన్నారు.

సార్! మాది ఈ వూరే. మానాన్న ఓ మధ్య తరగతి రైతు. వ్యవసాయం చేస్తాం. కొద్దిగా పొలం వుంది. చదువు మీద ఆపేక్షతో మా నాన్న నన్ను పట్నం పంపించాడు చదువుకోమని. ఆటలు, షికారులు, సినిమాలు, జల్సా తిరుగుళ్లతో ఎలాగో డిగ్రీ అయిందనిపించాను. ఈలోగా ఈ అనారోగ్యం వచ్చింది. పట్నంలో చదువు అయిపోయింది. తిరిగి ఇంటికొచ్చేశాను. వంట్లో బాగుండటంలేదు. ఇంట్లోనే పడివున్నాను రెండు రోజుల నుంచి జ్వరం వస్తోంది. వూరక ఇంట్లో కూర్చొని మూలుగుతూ వుండకపోతే అలా డాక్టరు గారి దగ్గరకు వెళ్ళి చూపించుకోరాదూ... మంచి డాక్టరు గారు... అని మా నాన్న పోరు పెడుతూంటే ఇలా వచ్చాను సార్” అన్నాడు నీరసంగా.

అంతా విని డాక్టర్. “శంకర్ ఈ రిపోర్ట్‌లు నీవేనా!”

“నావే సార్”

## గమనిక

సాహిత్య కార్యక్రమాల ఫొటోలు ప్రచురణార్థం పంపించేటపుడు ఆ కార్యక్రమం జరిగిన తేదీ, స్థలం తప్పక ఉదహరించాలి. ఈ వివరాలు లేకుండా వచ్చే ఫొటోలు ప్రచురణకు స్వీకరించబడవని గమనించగోర్తాం.

- ఎడిటర్

"ఏమో! నాకు నమ్మకం లేదు..."

"అదేంటి సార్! అలా అంటారు"

"అవునయ్యా! నిన్ను క్షుణ్ణంగా పరిశీలించాను. నీకు టి.బి. లేదు.

"ఏమిటి... టి.బి. లేదా?"

"యస్... నీకు టి.బి. వుందని ఎవరు చెప్పారు? లేనే లేదు."

"అయితే నాకు టి.బి. లేదా? అన్నాడు సంతోషంగా

లేదయ్యా... కాకపోతే కొంత బలహీనంగా ఉన్నావు. అంతే... బలం రావడానికి మందులు వాడాలి అన్నాడు డాక్టర్.

'సార్! నాకు టి.బి. లేదు అన్నారు. అంతే చాలు... మీ మాటతో నా మనస్సులో ఉత్సాహం పెరిగింది. ఇన్నాళ్ళూ నాకు టి.బి. ఉందనుకున్నాను. అయితే ఇది టి.బి. కాదన్న మాట. వట్టి బలహీనత అన్నమాట! దానికే ఇంత భయపడ్డాను... అంటూనే డాక్టర్ గారూ నాకు టి.బి. లేదు కదూ... అన్నాడు మళ్ళీ సందేహంగా.

"నా మాట మీద నమ్మకం ఉందా?"

"ఉంది సార్!"

అయితే నేను చెప్పినట్లు చేయి. నీకు బలం రావడానికి మందులు, టానిక్‌లూ రాసిస్తాను. అవి రెగ్యులర్‌గా వాడుతూండు. మంచి ఆహారం తీసుకో. వ్యాయామం చెయ్యి. 3 నెలలు ఇలా చేస్తే తిరిగి మామూలు మనిషివి అయిపోతావు. సరేనా!" అంటూ డాక్టర్‌గారు మందులు రాసి, భుజంతట్టి శంకరాన్ని బయటకు పంపించాడు.

సంతోషంతో వెలుగుతున్న ముఖంతో తృప్తిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు శంకరం.

డాక్టర్ చెప్పినట్టు మందులు వాడి, మంచి ఆహారం తింటూ వ్యాయమం చేస్తూ 3 నెలలు కాలం గడిపాడు. శంకరంలో జవసత్వాలు పుంజుకుని, పూర్వ ఆరోగ్యం ఏర్పడింది. మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

"శంకరం! ఒకసారి పట్నం డాక్టర్ దగ్గరకు వెళ్లి, కనబడి పరీక్ష చేయించుకురా! అన్నాడు డాక్టర్. 'సరేసార్' అంటూ పట్నం వెళ్లాడు. పట్నం డాక్టర్ శంకరాన్ని పరీక్షించి, ఆశ్చర్యంతో "శంకర్ నువ్వు భలేగా వున్నావే. నీ టి.బి. లక్షణాలు ఇపుడేం లేవు సంపూర్ణ ఆరోగ్యంగా వున్నావు. ఎలా సంభవం...? అన్నాడు.

"అసలు నాకు టి.బి వుంటే గదా డాక్టర్ గారూ తగ్గటానికి? అన్నాడు నిర్లక్ష్యంగా.

"వాట్! టి.బి. లేదా... ఎవరన్నారు?"

మా డాక్టర్‌గారు చెప్పారు అంటూ వచ్చేశాడు శంకర్ ఇక ఆయన మాట వినకుండానే. తిరిగి వచ్చి డాక్టర్‌గారితో జరిగింది చెప్పాడు.

దానికి డాక్టర్ 'శంకర్! నువ్వు మొదట నాదగ్గరికి వచ్చినపుడు నీకు టి.బి. ప్రమాద స్థాయిలోనే వుంది. పట్నం డాక్టర్ చెప్పింది నిజం. అయితే నీలోవున్న ఆందోళన, భయం, నిరాశా నిస్పృహలను పోగొట్టటానికే నీకు టి.బి. లేదని చెప్పాను. మంచి మందులు వాడాను. కుర్రవాడివి... వ్యాధి తీవ్రతను తట్టుకొని, మనోధైర్యంతో వ్యాధి నుంచి బయటపడ్డావు. ఇప్పుడు నీవు సంపూర్ణ ఆరోగ్యవంతుడివి' అన్నాడు.

బాగా వైద్యం చేయడమే కాదు... మనసు పెట్టి వైద్యం చేయగలవాడే 'మంచి డాక్టర్...' మనసులోనే అనుకొన్నాడు శంకరం ఆయనకు చేతులు జోడించి నమస్కరిస్తూ. ●